


వి. సుబ్బారెడ్డి

# నీ జన్మధన్యం

'ఏమ్మా మల్లీ! ఏమిటీ అంత విచారంగా ఉన్నావ్?"

మల్లి దగ్గరనుండి జవాబురాలేదు. దిగులుగా తల్లి ముఖంలోకి చూసింది.

"ఏమిటి తల్లీ నీ బాధ? నాతోకాక మరెవరికి చెప్పుకుంటావమ్మా? నీ మనసులో ఏముందో చెప్పినీ బాధను నన్ను కూడ పంచుకో నియ్యమ్మా!"

"నాకు భయమేస్తుందమ్మ" మెల్లిగా అంది మల్లి.

"భయమా? ఎందుకు?"

"మన ప్రక్క రోజీలేదూ? అది ఏమిటేమిటో వాగిందమ్మా. దానిమాటలు విన్నప్పటినుండి నా ఆనందమంతా నీళ్ళుకారిపోయి నా మనసంతా వికలమయి పోయిందమ్మా!"

"ఈ వయసులో నువ్వుహాయిగా, ఆనందంగా, ఈ ప్రపంచంలోని అందాలన్నీ నీకోసమేనన్నట్లు నిర్లక్ష్యంగా గడపాలి. ఎవరో ఏదో అన్నారని విచారించవలసిన అవసరమేలేదు. అసలింతకీ ఆ రోజీ ఏమన్నదేమిటి?"

"అది నాకంటే పెద్దది కదా అదీకాక నా కంటే అందంగా ఉంటుందన్న గర్వం కూడాదానికి. నేను నిన్నకాక మొన్నకళ్ళు తెరిచానట గబగబ ఎదిగి కూర్చున్నానట. ఈ లోకం గురించి, ఈ మనుషుల గురించి అంతా తనకే తెలిసినట్లు మాట్లాడుతుంటెప్పుడూ. ఇంతకు ముందు నన్ను చూసి 'ఏమే మల్లి అంతలావున తుళ్ళి పడుతున్నావ్ మహా

అందగత్తెననుకొని మిడిసిపోతున్నావేమో ఈ మిడిసిపాటెంత కాలంలే ఎవరో వచ్చి నిన్ను బలవంతంగా లాక్కుపోయి నలిపి నాశనంచేస్తారు. అప్పుడు మీ అమ్మ కాదు గదా, నిన్ను పుట్టించిన దేవుడు కూడ నిన్ను రక్షించలేడు' అంటూ ఇంకా ఏమేమిటో వాగింది. అది చెబుతుందేమిటో నాకు సరిగా అర్థంకాలేదు. వివరంగా చెప్పమంటే చెప్పదు. అప్పటి నుంచి నాకే అర్థంకాని దిగులు పట్టుకుంది. ఈ ప్రపంచంలోని అందాలన్నీ నావే అనుకున్నా. ఈ ప్రకృతిలోని సౌందర్యాన్ని, ఈచల్లని వాతావరణాన్ని చూస్తూ నిజంగానే మురిసిపోతున్ననాకు దాని మాటలు గొడ్డలి పెట్టే అయాయి. నువ్వైనా వివరంగాచెప్పమ్మాదాని మాటల కర్థమేమిటో."

కళ్ళనీళ్ళతో అడుగుతున్న మల్లిని చూసివాళ్ళమ్మకు కూడ దుఃఖమాగలేదు. కాని తల్లిగా తనకు తెలుసు, తాను దుఃఖపడి ప్రయోజనంలేదని. మల్లికి ఉపశమనం కావాలి. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే మనో నిబ్బరంకావాలి. తన బిడ్డ బ్రతుకుమూన్నాళ్ళ ముచ్చట అని తనకూ తెలుసు. కాని తానేంచేయగలదు? తన అసహాయత్వానికి తానే జాలిపడి గుండెరాయి చేసుకుంది. కనుగుడ్లలోంచి బయటకు రాబోతున్న కన్నీళ్ళను బలవంతంగా ఆపుకుంది.

"ఓసి పిచ్చి తల్లీ ఇందుకా ఇంతగా బాధపడిపోతున్నావ్ ఏదో గురువింద సామెతలా ఉన్నాయి ఆ రోజీ మాటలు. అదేం ఎల్లకాలం బ్రతక బోతుందదే నిన్నెక్కిరించడానికి ? ఆ మాటకొస్తే ఎవరు మాత్రం శాశ్వతం ? అంతా ఒకప్పుడు తనువులు చాలించేవాళ్ళేనమ్మా పోతే కాస్తముందు వెనుకలుతేడా"

"అందే.... రోజీ చెప్పింది నిజమే నన్నమాట నా బ్రతుకు త్వరలోనే ముగియబో తుందన్నమాట"

మల్లి ముఖంలో కనిపించిన నిరాశ, నిస్పృహను చూసి ఆమె మనసు ముక్కలయి పోయింది. అయినా బలవంతంగా ముఖంలోకి చిరునవ్వు తెచ్చుకుంది.

"నువ్వు అంతగా బాధపడవలసిన అవసరమే లేదమ్మా అసలు ఇదిచాల ఆనందించవలసిన విషయంనే చెప్పేది పూర్తిగా విను, నీకే అర్థమౌతుంది.

"చెప్పాను కదమ్మా తనువులెప్పుడూ శాశ్వతంకావని. మనం బ్రతికిన ఈ మూన్నాళ్ళలో నిస్వార్థంతో ఇతరులకు సంతోషం కలిగించే పనులు చేయాలి. అలా బయట ప్రపంచంలోకి చూడు. మనకు దేవుడు వెలుగునిచ్చాడు, గాలి నిచ్చాడు, మనం పుట్టి, పెరిగి బ్రతకడానికి కావలసిన సదుపాయాలన్నీ ఇచ్చాడు. ఈ వెలుగు, ఈ గాలి, ఆ ఆకాశం ఎంత నిర్మలంగా ఉన్నాయో చూడు. అంత నిర్మలత్వం మనలోలేక పోవచ్చు. కానివాటిల్లో ఉన్న సహస్రాంశం నిర్మలత్వం మనలో ఉంటే, ఈ ప్రకృతి మాత మనకు చేస్తున్న నిస్వార్థ సేవల్లో శత సహస్రాంశం సేవ మనం ఈ లోకంలోని ప్రాణులకు చేస్తే మన జన్మధన్యమయినట్లే తల్లీ ! మనల్నీ దేవుడు సృష్టించింది అందుకే నమ్మా ! నీ అందంతో నలుగుర్ని రంజింపజేయాలి. నీగుబాళింపును నాలుగు మూలలకు విరజిమ్మి నీకు ఆ దేవుడిచ్చినవ

రాన్ని ఇతరుల ఆనందంకోసం వినియోగించాలి. ఇదే నమ్మా నీ కర్తవ్యం!”

మల్లి మౌనంగా తల్లిమాటలు వింది. అయినా శంకలన్నీ తీరినట్లులేదు.

“మరి ఆరోజీ ఎందుకలా మాట్లాడిందమ్మా? నన్ను ఎవరో నలిపినాశనం చేశారని చెప్పింది”

ఆమె ఓ వేడినిట్టూర్పు వదిలింది మనసులోనే. తన బిడ్డకు పూర్తిగా వివరించి చెబితేగాని అది తాను నిర్వహించవలసిన కార్యం స్వార్థరహితంగా, హృదయపూర్వకంగా చేయలేదు అనుకుంది.

“ఆ రోజీ చాల వికృతంగా మాట్లాడింది. నీలాంటి నిస్వార్థసేవచేసే అవకాశం దానికి చాలతక్కువ. అందువల్లే దానికి నువ్వంటే అసూయ. దాని మాటలు నువ్వసలు పట్టించుకోవద్దు.

“నీ జీవితం నాలుగు ఘడియలు కావచ్చు, నాలుగు రోజులుకావచ్చు. నీ పరిధిలో నిన్ను నీవు మానవ సేవకోసం అంకితం చేసుకుంటే నీ జన్మసాఫల్యమౌతుంది. కాకి కలకాలం బ్రతికి ప్రయోజనం ఏముంది? పెరిగి, చివరకు నిష్ప్రయోజనంగా రాలిపోయే ఆ జన్మకు సార్థక్యం ఏముంది?

“నీ జన్మను నువ్వుచాల తక్కువగా అంచనా వేసుకున్నావమ్మా! నీ సాన్నిహిత్యంలో ప్రేమికుల మనసులురంజింపబడి ప్రేమగీతాలు ఆలాపిస్తారు. కవులు మహాకార్యాలు సృష్టిస్తారు. మనల్ని సృష్టించిన దేవుని పాదపీఠం అలంకరించగలిగిన మహోన్నతావకాశం నీ ఒక్కదానికే దక్కగలదమ్మా! నువ్వు కారణ జన్మరాలవు తల్లీ! అందువల్ల నీ మనసులోని అనుమానాలు, ఆశంకలు అన్నీ పక్కకునెట్టి, నిన్ను సృష్టించిన ఆ విధాతకు జోహార్లర్పించు!”

ఇలా మల్లికి వాళ్ళమ్మ ఎన్నో ధైర్య వచనాలు చెప్పింది. ఎన్నో ఉదాహరణలు చూపుతూ తన కర్తవ్యాన్ని బోధించింది.

మల్లి మనసులోని అనుమానాలు, భయాలు పూర్తిగా దూది పింజల్లా విడిపోయాయి. తను కారణ జన్మురాలనని తల్లి చెప్పిన మాటలు మనసులో గట్టిగా నాటుకున్నాయి. పరవశించిపోతూ ప్రపంచాన్ని గర్వంగా చూసింది. నిర్మలాకాశాన్ని ఆరాధనగా గమనించింది.

ఆ రోజంతా మల్లి మనసునెవరూ పట్టలేక పోయారు. పూలబాలలతో ఆడింది, పాడింది. అడ్డువచ్చిన రోజీని వెక్కిరించింది. పట్టరాని కోపంతో, అసూయతో ఎర్రబడ్డదాని ముఖాన్ని చూసి హాయిగా నవ్వుకుంది అలిసిపోయి ప్రకృతి మాతవడిలో పవ్వళించింది.

కొన్ని, తల్లి మనసులో అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయని మాత్రం తెలుసుకోలేక పోయింది.

సాయంత్రమయింది. సూర్య భగవానుడు తన దినచర్యచాలించి పడమటి కొండల్లోకి జారబడే సమయమయింది.

అప్పుడు వచ్చాడతను. అతన్ని చూడ్డంతోనే అర్థమైంది తనకోసమే వచ్చాడని. ఎక్కడలేని భయంతో వళ్ళంతా గగుర్పొడిచింది. తల్లిచాటు మొగ్గే అయింది.

అయినా తల్లినుండి బలవంతంగా తనను వేరుచేశాడు. అతని మోటు చేష్టలకు తన శరీరమంతా నరకయాతన పడి

పోయింది. బాధ భరించలేక 'అమ్మా' అని పెద్దగా అరిచింది, కాని అమ్మ ఏమీ చేయలేక, నిస్సహాయంగా నిలుచున్నచోటునుండే కళ్ళనీళ్ళు కుక్కుకుంటూ మౌనంగా రోదించింది.

"అమ్మా! పీడు నన్ను నలిపివేస్తున్నాదమ్మా! నన్నెక్కడికో బలవంతంగా లాక్కెళుతున్నాదమ్మా!" మల్లి చేస్తున్న ఆర్తనాదాలు కలిసిపోతున్నాయి.

"అమ్మా మల్లీ! ఉదయం నేను చెప్పినమాటలు అప్పుడే మర్చిపోయావా? నువ్వు కారణ జన్మురాలవని చెప్పలేదూ? నువ్వు ఆత్మార్పణ చేసుకొని నిస్వార్థంతో మానవసేవ చేసే తరుణం ఇప్పుడే లభించిందమ్మా, నీ కర్తవ్యాన్ని మరిచి పోవద్దు..." తల్లిమాటలు లీలగా వినిపించాయి.

మల్లి మళ్లీ ధైర్యాన్ని పుంజుకుంది. అవును! తను కారణ జన్మురాలు. పీళ్ళెన్ని బాధలు పెట్టినా సంతోషంతో భరించి పీళ్ళకు నిస్వార్థ సేవ చేస్తుంది. తన అనుమానాలన్ని పక్కకు నెట్టి చిరునవ్వుతో బయలుదేరింది ఆయమదూతతో

"క్షేమంగా వెళ్ళిరా మల్లి తల్లీ!" వెళ్ళడమేగాని మళ్ళీ తిరిగిరాదని తెలిసిన ఆ తల్లి దైన్యంగా పలికింది.

తనలాటి అభాగినులు తనతో చాలమంది ఉన్నారు. అందర్నీ బోరీలో సామాన్లువేసి కుక్కినట్లు కుక్కి తీసుకెళుతున్నాడతను. పడుతూ, లేచి మళ్ళీ నిలదొక్కుకుంటూ తమ ప్రయాణం సాగించారు. తన సహచరులు అ సహాయంగా రోదిస్తుంటే మల్లి వాళ్ళకు ఉపశమనపు మాటలు చెప్పడానికి ప్రయత్నించింది. కాని వాళ్ళకా మాటలు రుచించలేదు. తల్లి తనకు చెప్పినంత విపులంగా తాను వాళ్ళకు చెప్పలేకపోయింది. చెప్పినా వినేస్థితిలోలేరు వాళ్ళు.

మల్లి ఎన్నో చేతులు మారింది. తన ముందే బేరాలు జరుగుతున్నాయి. కొంటున్నారు. మళ్లీ మరోచోట అమ్ముతున్నారు. చివరకు తను బజారు సరుకైపోయింది. అయినా, అడుగడుగునా తల్లి మాటలు జ్ఞాపకం చేసుకొంటూ తన ధైర్యాన్ని కోల్పోకుండా జరుగుతున్న కార్యక్రమమంతా మౌనంగా భరించింది.

తాను పుట్టింది, పెరిగింది నిర్మలమైన, ప్రశాంతమైన వాతావరణం. కాని, ఎప్పుడూ కనీవినీ ఎరుగని ఈ జన సందోహం, కర్ణకఠోరమైన ఈ శబ్దాలు కల్మషంతో నిండిన ఈ పరిసరాలు. పీటి నన్నిటిని చీదరించుకుంటూ అయిష్టంగా భరిస్తూనే, విస్మయంగా తికమకత సాగింది.

రాత్రయి పోయింది అయినా, ఎటు చూసినా వెలుగుతున్న దీపాలతో రాత్రి పగలులాగేవుంది.

ఆ సమయంలో ఒక యువతి ఒక యువకుడు మల్లి ప్రస్తుత యజమాని వద్దకు వచ్చారు. వాళ్ళను చూసిన మల్లి, ఆహా! ఇద్దరూ ఎంత చక్కగా, చూడ ముచ్చటగా ఉన్నారు అనుకుంది. వాళ్ళు తన యజమానితో ఏదో మాట్లాడితననూ తన సహచరులను కొందరిని కొనేశారు. మళ్ళీ ఉచ్చుల్లో బిగించబడి మల్లి ప్రయాణాన్ని సాగించింది. బజారు రణగొణ ధ్వనులకు దూరమైపోయారు.

ఆ యువతి యువకులు ఒకచిన్న ఇంటిలోనికి వాళ్ళను తీసుకెళ్ళారు. బిగించబడ్డ ఉచ్చులు విప్పబడ్డాయి.

స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న మల్లి కెందుకో అనిపించింది, ఇదే తన ఆఖరి ప్రయాణమని.

అప్పుడాయింటిని పరిశీలనగా గమనించింది. తన ఇంటివాతావరణానికి పూర్తిగా విభిన్నంగా ఉంది. అయినప్పటికీ ఇక్కడ కూడ చాలప్రశాంతంగా ఉంది. ఇల్లు చిన్నదైనా పరిశుభ్రంగా, పొందికగా అమర్చబడి ఉంది. చూడ చక్కటి ఆ జంట, వాళ్ళ ప్రణయ సంభాషణలు, ఒకరి పై ఒకరు చూపుకొనే ఆరాధన దృక్కులు- ఈ దృశ్యాలన్నీ గమనిస్తున్న మల్లికి చాల ముచ్చటేసింది.

ఆ యువతి తీరిగ్గా కూర్చుని, అతనితో కబుర్లు చెప్పుకుంటూ తనను, తన వాళ్ళను దారాలతో బంధిస్తుంటే బాధగా ఉన్నా సన్నగా, తెల్లగా తనలాగే సుకుమారంగా ఉన్న ఆవిడ చేతివ్రేళ్లను గమనిస్తూ తన బాధను మరిచిపోవడానికి ప్రయత్నించి సఫలీకృతురాలైంది.

మల్లి, మిగతా పూల బాలలు ఆ యువతి చేతుల్లో పూలమాలలయ్యాయి. మధ్యమధ్య పూల బాలలను ఆమె తన నాసికాపుటాలకు చేర్చి, వాటి సువాసనలకు తన్మయమైపోతుంటే ఆమె సంతోషానికి కారకురాలైనందుకు సంబర పడింది.

ఆ మాలను పూజా మందిరంలోని దేవుని పాదాల ముందుంచి ఆమెభక్తితో చేతులు జోడించి దేవుణ్ని ప్రార్థించింది.

"ఆహా ! అమ్మ చెప్పింది అక్షరాలా నిజమైంది ఇన్ని కష్టాలుపడ్డా చివరకు నేను దేవుడ పాదాల వద్దకు చేరాను. నా జన్మ సార్ధకమైంది." మల్లి ఆనందంతో పులకించిపోయింది.

అతను కూడ ఒకసారి దేవుడికి దణ్ణం పెట్టుకుని, ఆ పూలమాలను తీసి ఒకసారి తనివితీరావాసన చూసి, ఆమె తలలో తురిమాడు. ఏవేవో చిలిపి మాటలు మాట్లాడుతూ, మళ్ళీ ఆమె తలలోని పువ్వులను గట్టిగా వాసన చూసి, ఆమె బుగ్గలను ముద్దు పెట్టుకున్నాడు. ముందున్న అద్దంలోనుంచి కెంపులయిన ఆమె బుగ్గలను, తన్మయత్వంలో వెలిగిన ఆమె కళ్ళను మల్లి చూడగలిగింది.

"వాళ్ళ అంత ఆనందానికి నేను గదా కారకురాల్ని. నా జన్మ ఇప్పటికి ధన్యమైంది. నేను నిజంగానే కారణ జన్మురాలను" మల్లి పరవశం వర్ణనాతీతమే అయింది.

అప్పుడే ఎక్కడ నుండో జంధ్యాల వారి పుష్పవిలాపం పద్యాలు ఘంటశాల వారి శ్రావ్య కంఠంలోంచి విషాదంగా వినిపిస్తున్నాయి.

"నాలాంటి పువ్వులిచ్చిన ప్రేరణ శక్తివల్లే మీరు అంతగొప్ప కవిత్వాన్ని రాయగలిగారు స్వామీ ! కాని ఈ మానవులు నా స్వేచ్ఛా జీవనానికి ఎంత అడ్డు వచ్చినా. దారాలతో నాకు ఉరి బిగించినా నేను బాధపడటంలేదు. పైగా నేను చేస్తున్న ఈ చిన్నిపాటి సేవకు నేనెంతో గర్వపడుతున్నాను" అనుకుంది మల్లి, మర్నాటి ఉదయానికి వాడిపోయిన తమను చీపురుతోవూడ్చి, చెత్తలో పారవేస్తారని తెలిసినా.

మల్లెల సౌరభంతో ఆ యిల్లంతా గుభాళించింది. ●